సాక్షి పెద్దపల్లి

గురువారం ◆ 8 ◆ జూన్ ◆ 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,998

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాల్‌కు రూ. 6,998 పలికింది. కనిష్టంగా రూ. 5918, సరాసరి రూ.6,725గా నమోదైంది.



బాలికలకు ఎన్టీపీసీ భరోసా

రామగుండం ఎన్టీపీసీ సంస్థ తమ పరిధిలోని ప్రాంతాల ప్రజల జీవితాల్లో వెలుగులు పంచేందుకు శ్రీకారం చుట్టింది.

గరిష్టం/కనిష్టం
42.0/30.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండ తీవ్రమవుతుంది. ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య



సుల్తాన్‌పూర్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్ అందిస్తున్న డీఈవో

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించాలని డీఈవో డి.మాధవి అన్నారు. మండలంలోని ధూళికట్ట, ఎలిగేడు, సుల్తాన్‌పూర్‌లో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. 11 మంది విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించారు. మండల విద్యా వనరుల కేంద్రంలోని యూనిఫామ్స్‌ను పరిశీలించారు. సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి పీఎం షేక్‌తో కలిసి దుస్తులను పిల్లలకు అందించారు. ఎంఈవో కవిత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు ప్రారంభం



పైప్‌లైన్ తవ్వకం ప్రారంభిస్తున్న అధికారులు, గ్రామస్తులు

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా పరిధి భూక్యా, ఇస్లావత్‌వాడల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను బుధవారం అధికారులు ప్రారంభించారు. ఆ వాడలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, ట్యాంక్ నిర్మించి రెండేళ్లు దాటినా కనెక్షన్ ఇవ్వలేదని పంచాయతీ పాలకవర్గం ఇటీవల ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. స్పందించిన ఈఈ శ్రీనివాస్, ఏఈ మధు పొక్లెయిన్ సహాయంతో పైప్‌లైన్ తవ్వకాలు ప్రారంభించారు. రెండు, మూడు గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు సర్పంచ్ బదావత్ రాజునాయక్ పేర్కొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు బహిష్కరణ



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ మల్లేశ్

మంథని: ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట దోపిడీ.. పంచాయతీలకు నిధుల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను బహిష్కరిస్తూ తీర్మానించినట్లు మండలంలోని నాగారం సర్పంచ్ బూడిద మల్లేశ్ తెలిపారు. ఈనెల రెండున గ్రామసభ ఏర్పాటు చేశామని, ఐదో తేదీలోగా సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉత్సవాలను బహిష్కరించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఉత్సవాలను బహిష్కరిస్తున్నట్లు బుధవారం సీఎం కేసీఆర్, కలెక్టర్, డీపీవోకు మెయిల్ పంపినట్లు పేర్కొన్నారు. గ్రామంలో 45 రోజులుగా సాగుతున్న ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారని, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. పంచాయతీకి నిధులు విడుదల కావడం లేదన్నారు.

పెట్రోల్ బంక్‌కు స్థలం గుర్తింపు



కేటాయించిన స్థలం ఇదే

సుల్తానాబాద్: సివిల్ సప్లై ఆధ్వర్యంలో నిర్మించే పెట్రోల్‌బంక్‌కు అవసరమైన స్థలాన్ని రాజీవ్ రహదారి పక్కన గుర్తించారు. ఆ స్థలానికి మున్సిపల్ పాలకవర్గం ఎన్‌ఓసీ కూడా అందించినట్లు కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని శాస్త్రినగర్‌లో గల 229 సర్వే నంబర్‌లో 20 గుంటల స్థలం కేటాయించారు. సివిల్ సప్లై అధికారుల సౌజన్యంతో నడిచే పెట్రోల్ బంక్ కావడంతో కలెక్టర్ సంగీత సిఫార్సు మేరకు తీర్మానాన్ని ఆమోదించి రెవెన్యూ శాఖకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. బంక్ పూర్తయితే వినియోగదారులకు కల్తీ లేని ఇంధనం అందనుంది.

హక్కుల గోడు తీరేదెన్నడు?



- ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు మారం ఓదెలు. ఎలిగేడు మండలం ధూళికట్ట. ఈయనకు అదే గ్రామంలో 196/6 సర్వేనంబర్‌లో 30 గుంటల భూమి ఉంది. ఆ భూమిని సాదాబైనామా ద్వారా పట్టా చేసుకునేందుకు నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. నేటివరకూ పట్టాకాలేదు. అప్పటినుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. అధికారులను అడిగితే ధరణి పోర్టల్ రావడంతో సాదాబైనామా ఆప్షన్ లేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆ భూమిలో పండించిన ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలు అమ్ముకోవాలంటే ఇతర రైతులపై ఆధారపడాల్సి వస్తోందంటున్నాడీ రైతు.



- ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచని సాదాబైనామా..
- అనర్హుల పేరుతో జిల్లాలో ముగ్గురికే పోడు పట్టాలు
- భూహక్కు పత్రాలు లేక పథకాలకు దూరం

సాక్షి, పెద్దపల్లి: భూహక్కు పత్రాల కోసం పేదలు చేసుకున్న దరఖాస్తులు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఫలితంగా కళ్లముందు భూములున్నా యాజమాన్య హక్కులు లేక రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను వినియోగించుకోలేక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. సాదాబైనామా పేరిట తెల్లకాగితాలపై రాసుకుని క్రయవిక్రయాలు జరిగిన భూములను క్రమబద్ధీకరించే దిశగా ప్రభుత్వం మూడేళ్ల క్రితం చర్యలు చేపట్టింది. కాగితాలపై కొనుగోలు చేసిన భూములకు చట్టబద్ధత కోసం 2020 నవంబరు 10వరకు గడువు విధించటంతో జిల్లాలో 35,580 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటి పరిష్కారం కోసం వేచిచూస్తున్నారు. మరోవైపు పోడు పట్టాల కోసం జిల్లాలో పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నప్పటికీ కేవలం ముగ్గురినే అర్హులుగా తేల్చటంతో మిగిలిన అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

రెవెన్యూ చట్టం ఆధారంగా ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి భూముల క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. దీంతో తెల్లకాగితాలపై కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న వారి పేర్లు రికార్డుల్లో లేకపోవడంతో ఇతర వ్యక్తుల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సాగులో ఒకరు.. రికార్డుల్లో మరొకరు ఉండటంతో రికార్డుల్లో పేర్లు నమోదై ఉన్న వ్యక్తుల వారసులు, కుటుంబసభ్యుల నుంచి ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు వివాదాలు ప్రారంభమై పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. సమస్య పరిష్కారానికి రికార్డుల్లో పేర్లు మార్చేందుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

పథకాలకు నోచుకోక..

సాదాబైనామా కింద భూములు సాగు చేస్తున్న రైతుల వద్ద అధికార పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం పథకాల నుంచి లబ్ధి పొందలేకపోతున్నారు. ముఖ్యంగా రైతుబంధు, బీమాకు దూరమయ్యారు. బ్యాంకు రుణాలు కూడా లభించక ప్రైవేటుగా అప్పు చేస్తున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ భూములను క్రమబద్ధీకరిస్తే ఇతర రైతుల మాదిరి లబ్ధి పొందగలుగుతామని చెబుతున్నారు.

ముగ్గురికే పోడు పట్టాలు

జిల్లాలోని 52 పంచాయతీల్లో పోడు దరఖాస్తులు స్వీకరించగా.. 488మంది గిరిజనులు 934 ఎకరాల్లో, 4,108 గిరిజనేతరులు 7,229 ఎకరాల్లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఉపగ్రహ చిత్రాలతో సాగులోని భూములను గుర్తించారు. అందులో అత్యధికులను అనర్హులుగా నిర్ధారించి సబ్‌డివిజన్, జిల్లాస్థాయి కమిటీ ఆమోదముద్ర వేసి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో జిల్లాలో కేవలం ముగ్గురు మాత్రమే అర్హులుగా గుర్తించి ఎకరం చొప్పున భూపంపిణీ చేయనున్నారు. దరఖాస్తుల పరిశీలనలో అనేక నిబంధనలు విధించి అర్హత ఉన్నా తిరస్కరించారని, చాలాచోట్ల మోకా సర్వే పారదర్శకంగా చేయలేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో స్వీకరించిన దరఖాస్తులు

మండలం	సాదాబైనామా	పోడు
అంతర్గాం	903	112
పాలకుర్తి	1642	404
ధర్మారం	2294	653
ఎలిగేడు	1245	-
కమాన్‌పూర్	512	13
రామగుండం	412	-
రామగిరి	1243	261
జూలపల్లి	1220	167
ముత్తారం	2834	686
శ్రీరాంపూర్	5670	765
ఓదెల	3557	-
పెద్దపల్లి	5939	737
మంథని	4563	767
సుల్తానాబాద్	3556	-

సాగునీటి రంగంలో పురోగతి



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

- మిషన్‌కాకతీయతో చెరువులకు జలకళ
- ఇంజినీర్ విద్యాసాగర్‌రావు సేవలు చిరస్మరణీయం
- సాగునీటి దినోత్సవంలో మండలి చీఫ్‌విప్, ఎమ్మెల్యే, కలెక్టర్

పెద్దపల్లిరూరల్: పంటల సాగుకు సాగునీరు అందించేందుకు రాష్ట్రం సాధించిన పురోగతి లిఖించదగిందని శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. సాగునీటి రంగంలో రాష్ట్రం సాధించిన అద్భుతాలకు సంబంధించిన పుస్తకాలు ఆవిష్కరించి, వీడియోలను ప్రదర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎండిపోయిన చెరువులకు జలకళ తెచ్చారని పేర్కొన్నారు. మిషన్‌కాకతీయతో చెరువులన్నీ వేసవిలోనూ జలకళ సంతరించుకున్నాయన్నారు. జిల్లాలో 650 చెరువుల అభివృద్ధికి రూ.218కోట్లు ఖర్చు చేశారన్నారు. జిల్లాలో 1.80లక్షల ఎకరాల నుంచి 2.86 లక్షల ఎకరాలకు విస్తీర్ణం పెరిగిందని కలెక్టర్ సంగీత తెలిపారు. సాగునీటి వనరులు ఉండడమే ఇందుకు కారణమన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో సాగునీటి లభ్యత పెరగడంతో పంటలు పండుతున్నాయని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీ వైస్ చైర్మన్ మండిగ రేణుక, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులున్నారు.

కాళేశ్వరంతో పెరిగిన ఆయకట్టు

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో చివరి ఆయకట్టు భూములకూ నీరు చేరుతుందని నీటి పారుదల శాఖ ఎస్‌ఈ కరుణాకర్ తెలిపారు. బుధవారం మంథనిలోని ఎస్‌ఎల్‌బీ గార్డెన్‌లో సాగునీటి ఉత్సవాలు నిర్వహించారు. కాళేశ్వరం నిర్మాణానికి ముందు మంథనిలో 28 వేల ఎకరాల ఆయకట్టు సాగుకాగా ప్రస్తుతం 34వేల ఎకరాలకు చేరిందన్నారు. నియోజకవర్గంలో రూ.120 కోట్లతో చెక్‌డ్యాంలు నిర్మించినట్లు తెలిపారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగంలోకి వస్తే 34 వేల ఆయకట్టుకు నీరందుతుందని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, నీటి పారుదల శాఖ ఈఈ బలరాం, డీఈఈలు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

తెలంగాణ దశ మార్చిన కేసీఆర్

గోదావరిఖని: రాష్ట్ర దశను మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. గోదావరిఖని ఆర్జీ–1 కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన సాగునీటి దినోత్సవంలో మాట్లాడారు. ధ్వంసమైన చెరువుల పునరుద్ధరణకు మిషన్ కాకతీయ తెచ్చారని పేర్కొన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతలపై ప్రతిపక్షాలు సృష్టించిన అపోహలు, అనుమానాలను పటాపంచలు చేశారని వివరించారు. ఇరిగేషన్ ప్రగతి నివేదికను ఈఈ విష్ణుప్రసాద్ సమర్పించారు. మేయర్ అనిల్‌కుమార్, ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, ఇరిగేషన్ ఎస్‌ఈ కరుణాకర్, ఈఈ ఓంకార్, డీఈ సత్యనారాయణ, కీర్తి, పాలకుర్తి ఎంపీపీ వాల అనసూర్య, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ముందుగా బల్దియా కార్యాలయం నుంచి సింగరేణి కమ్యూనిటీ హాల్‌వరకు ర్యాలీ నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్‌లో సాగునీటి సంబరాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్లయ్యకుంట చెరువులో రైతులు, మత్స్యకారులు బుధవారం సాగునీటి సంబరాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్సారెస్పీ కాలువ చివరి భూముల రైతులు సాగునీటికి పడుతున్న ఇబ్బందులను గమనించి ఈద శంకర్‌రెడ్డి రాయపేట బోడగుట్టల వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారని, హుస్సేన్‌మియా వాగు నుంచి వృథాగా పోయే నీటిని ఒడిసిపట్టి రూ.22కోట్లతో రాయపేట ఎత్తిపోతల పథకం పూర్తిచేయించారని గుర్తు చేశారు. చెరువులు, బావులు నీటితో కళకళలాడుతున్నాయని మీర్జంపేట ఎంపీటీసీ గూడెపు జనార్దన్ రెడ్డి అన్నారు. నల్ల రాజిరెడ్డి, శంకర్, మల్లయ్య, శ్రీనివాస్, రాజమల్లు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఐదేళ్ల హామీకి కుదిరిన ముహూర్తం



వంతెన నిర్మాణ ప్రాంతం

- రేపు సీఎం కేసీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన
- మంచిర్యాల జిల్లాలో పునాది రాయి

రామగుండం: ఐదేళ్ల క్రితం.. అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా సీఎం కేసీఆర్ గోదావరినదిపై వంతెన నిర్మాణం చేపడతామన్న ప్రకటనకు మోక్షం లభించింది. ఈనెల 9న మంచిర్యాల వైపు సీఎం కేసీఆర్ చేతులమీదుగా శంకుస్థాపనకు ముహూర్తం ఖరారైంది. ఈ వంతెన పనులకు ఏడాది క్రితమే టెండర్లు పిలిచారు. రూ.164కోట్లకు వల్లభనేని కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు దక్కించుకుంది. రెండేళ్లలో వంతెన పూర్తిచేయాలనేది నిబంధన. ఐదుమాసాల క్రితం వంతెనకు ఇరువైపులా ప్రత్యేక యంత్రంతో గోదావరిలో భూపరీక్షలు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో.. వరదనీటితో సంబంధం లేకుండా నిర్మాణ పనులుకొనసాగనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అంతర్గాం వైపు నిర్మాణ పనులకు ఏర్పాట్లు

సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన మరుసటి రోజు నుంచి వంతెన పనులను రెండు వైపులా ప్రారంభించేందుకు ఇంజినీర్లు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అంతర్గాం వైపు సమ్మక్క గద్దెల ప్రాంగణంలో నిర్మాణ సామగ్రి నిల్వ చేసేందుకు షెడ్లు నిర్మిస్తున్నారు. విలేజి అంతర్గాం నుంచి వంతెనను కలిపే అప్రోచ్ రోడ్డుకు మార్కింగ్ చేసి జెండాలు, కొన్నిచోట్ల హద్దు రాళ్లు పాతారు.

తగ్గనున్న దూరభారం

గోదావరిపై వంతెన నిర్మాణంతో మంచిర్యాల–పెద్దపల్లి జిల్లాల మధ్య సత్సంబంధాలు పెరగనున్నాయి. మంచిర్యాల పుష్కరఘాట్ నుంచి అంతర్గాం మీదుగా రాజీవ్ రహదారి (బుగ్గ ఎక్స్‌రోడ్) కలవనుంది. గతంలో కరీంనగర్ నుంచి గోదావరిఖని మీదుగా మంచిర్యాలకు వెళ్లాలంటే 110 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. వంతెన పూర్తయితే 60 కిలోమీటర్లకే మంచిర్యాల చేరుకునే అవకాశం ఉంది. దీంతో గోదావరిఖని, చెన్నూర్ ఎక్స్‌రోడ్, శ్రీరాంపూర్, సీసీసీ రహదారులపై వాహనాల ఒత్తిడి తగ్గుతుంది. వాహనదారులకు ఇంధన ఆదా అవుతుంది. పైగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గనున్నాయి.

కాంగ్రెస్ కమిటీలన్నీ రద్దు

- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



పెద్దపల్లిరూరల్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కమిటీలన్నీ రద్దు చేస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బుధవారం ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశానుసారం మండల, మున్సిపల్ కమిటీలు రద్దయ్యాయన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని పునర్వ్యవస్థీకరించేందుకు ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిల్లో పార్టీని బలోపేతం చేసేలా కొత్త కమిటీలను ఖరారు చేస్తామన్నారు. ఐదు గ్రామాలకు ఓ క్లస్టర్‌గా కమిటీల నియామకం ఉంటుందన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోనూ క్లస్టర్ లెవల్ కమిటీలను ఏర్పాటు చేస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేసేలా కార్యాచరణ ఉంటుందన్నారు. ప్రతికార్యకర్త సైనికుడిలా పనిచేస్తూ బీఆర్‌ఎస్ అవినీతి పాలనను గ్రామస్థాయి నుంచి ఎండగట్టేలా కార్యాచరణ ఉంటుందని వివరించారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

సుల్తానాబాద్‌రూరల్: ప్రజల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లెలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో డబుల్ ఇళ్లు కట్టిస్తామని చెప్పి తొమ్మిదేళ్లు అవుతున్నా ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సొంతింటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని వెల్లడించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పన్నాల రాములు, సతీశ్, మహేందర్, ఈర్ల శేఖర్ తదితరులున్నారు.

నేటి నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని జిల్లా మత్స్య శాఖ అధికారి భాస్కర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. వివిధ రకాల చేపల వంటకాలు తయారు చేసి అమ్ముతామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

గ్రూప్-1 పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు
- 6,067 మంది అభ్యర్థులు
- కలెక్టర్ సంగీత



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈనెల 11న జరిగే గ్రూప్–1 పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ కేంద్రాల్లో 6,067మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. రామగుండంలో 10, పెద్దపల్లిలో 3, సుల్తానాబాద్‌లో 2, రామగిరిలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షాకేంద్రాలకు వచ్చే దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు. అభ్యర్థులను ఉదయం 8.30గంటల నుంచి లోనికి అనుమతించాలన్నారు. కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు, డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.

బడి ప్రారంభం రోజే పుస్తకాలు

- అదే రోజు యూనిఫాంలు కూడా..
- జిల్లాకు చేరిన 2,54,880 పుస్తకాలు
- ఇప్పటికే 2,17,010 పంపిణీ
- 76,454 యూనిఫాంలు సిద్ధం
- జిల్లాలో 38,227 మంది విద్యార్థులు

సుల్తానాబాద్: ఈనెల 12న.. పాఠశాలలు పునఃప్రారంభవుతున్న విషయం తెల్సిందే. అయితే అదేరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించాలని ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. దర్జీలపై ఒత్తిడి పెంచి మరీ దుస్తులు కుట్టించారు. వాటిని ఎమ్మార్సీలకు చేరవేస్తున్నారు.

జిల్లాలో 984 పాఠశాలలు

జిల్లావ్యాప్తంగా 984 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 38,227 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యం, ఎన్నికల సీజన్ కావడంతో ఈసారి అధికారులు ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గతంలో కంటే భిన్నంగా ముందు నుంచే పాఠ్య పుస్తకాలు పాఠశాలలకు తరలించి ప్రారంభంరోజే విద్యార్థులకు అందించేలా చర్యలు చేపడుతున్నారు. వీటితోపాటు యూనిఫాం కూడా అందించనున్నారు. పాఠశాలల పునఃప్రారంభంరోజు ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి పాఠశాల స్థితిగతులను చూసే అవకాశం ఉంది.

ఒక్కో విద్యార్థికి రెండు జతలు

ఈ విద్యా సంవత్సరం ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫాం ఇవ్వనున్నారు. జిల్లాలోని మొత్తం 38,227 మంది విద్యార్థుల కోసం రెండు జతల చొప్పున మొత్తం 76,454 దుస్తులను కుట్టించారు.

పారదర్శకంగా వివరాలు

జిల్లాలో ఆయా పాఠశాలలకు సరఫరా చేసే పుస్తకాల వివరాలను జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక రిజిస్టర్లు ఏర్పాటు చేసి నమోదు చేస్తున్నారు. ఏ రోజు ఎన్ని పుస్తకాలు వచ్చాయో.. ఆ వివరాలు పొందుపరుస్తున్నారు. పుస్తకాలు పక్కదారి పట్టకుండా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. కిందిస్థాయి సిబ్బంది బహిరంగ మార్కెట్‌కు సరఫరా చేయకుండా ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రతి పుస్తకానికి క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసింది.



పాఠ్యపుస్తకాలను ఎమ్మార్సీలకు తరలిస్తున్న అధికారులు

అసౌకర్యం లేకుండా చర్యలు



ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. బడులు ప్రారంభించిన రోజే పుస్తకాలను విద్యార్థులకు అందజేయనున్నాం. ఈ సారి మెరుగైన విద్యా బోధన సాగేలా కృషి చేస్తున్నాం.

– మాధవి, డీఈవో

క్లుప్తంగా

బైక్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం


భూమయ్య (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లికి చెందిన అడెపు భూమయ్య (67) మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. భూమయ్య కమాన్‌పూర్ నుంచి జూలపల్లికి నడుచుకుంటూ వెళ్తుండగా కమాన్‌పూర్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. తలకు తీవ్రగాయాలుకాగా కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే భూమయ్య మృతి చెందాడని వైద్యులు తెలిపారు. భూమయ్య కుమారుడు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ తెలిపారు.

12న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర సాధనలో పోరాడిన ఉద్యమకారులను సీఎం కేసీఆర్ ప్రభుత్వం విస్మరించిందని, అందుకే జిల్లాకేంద్రంలోని జెండా కూడలిలో ఈనెల 12న వారిని సత్కరిస్తామని ప్రజాహిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలో మాట్లాడారు. తెలంగాణ ద్రోహులంతా సీఎం కేసీఆర్ సర్కార్‌లో పదవులు అనుభవిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య తదితరులున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కార్మికులతో కలిసి ఆర్జీ–2 పర్సనల్ మేనేజర్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాలుగేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ చిట్టీలను కాంట్రాక్ట్‌కార్మికులకు ఇవ్వకపోవడంతో జీతంలో రికవరీ అవుతున్న డబ్బులు విషయంలో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సర్క్యులర్ ప్రకారం ప్రతీనెల 7వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు బుచ్చమ్మ, పద్మ, గట్టయ్య, పవన్, సమ్మయ్య, దుర్గేశ్, శంకర్, మల్లేష్, భవాని, ఎం శంకర్, లింగయ్య పాల్గొన్నారు.

శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది


పాపకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సంధ్య రెండో కాన్పు కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి, బుధవారం ఆడబిడ్డకు జన్మించింది. ఆ శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తి, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ వెళ్లాలని సూచించారు. బాధిత కుటుంబసభ్యులు 108కి సమాచారం అందించగా సిబ్బంది అనిల్‌కుమార్, పైలట్ పెద్ది శ్రీనివాస్ వచ్చి, పాపను కరీంనగర్ తరలించే క్రమంలో ఆక్సిజన్ అందిస్తూ ఉన్నారు. పాప కళ్లు తెరవడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సరైన సమయంలో శిశువు ప్రాణాలు కాపాడారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల భవితకు ఎన్టీపీసీ భరోసా

- వివిధ రంగాల్లో 120 మందికి శిక్షణ
- సహకరిస్తున్న హీరో మైండ్ మైన్ సంస్థ
- ఎన్టీపీసీ సీఎస్సార్ ఆధ్వర్యంలో నిర్వహణ


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎన్టీపీసీ సంస్థ తమ పరిధిలోని ప్రాంతాల ప్రజల జీవితాల్లో వెలుగులు పంచేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభావిత, పునరావాస ప్రాంతాలైన అంతర్గాం, పాలకుర్తి, రామగుండం మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో ఐదోతరగతి పూర్తిచేసిన వారికి బాలికా సాధికారత మిషన్–2023 ద్వారా శిక్షణ ఇస్తోంది. రామగుండం ప్రాజెక్టు పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని శ్రీ చైతన్య కళాశాల భవనంలో 120మంది బాలికలకు(10–12 ఏళ్లలోపు) శిక్షణ ఇస్తున్నారు. గతనెల 17న కలెక్టర్ సంగీత జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈనెల 14 వరకు కార్యక్రమం కొనసాగనుంది.

ఇదీ.. కార్యక్రమం ఉద్దేశం

- బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించడం. వ్యక్తిగత అంశాలు, ఇంటర్నెట్, మొబైల్ ద్వారా జరుగుతున్న సైబర్ నేరాలు, భవిష్యత్‌పై భరోసా కల్పించడం. జీవితంలో సమున్నత లక్ష్యాలను చేరుకోవాలనే ఆలోచన, తపన కల్పించడం.
- సరళమైన తెలుగు, ఆంగ్ల భాషపై పట్టు, యోగా, గణితశాస్త్రంలో ప్రాథమిక సూత్రాలు, మెలకువలు, పర్యావరణశాస్త్రం, ఆత్మరక్షణ, క్రీడలు, కంప్యూటర్స్ వినియోగం, పౌష్టికాహారంతో ఉపయోగాలు, 5ఎస్ విధానాలపై శిక్షణ ఇస్తున్నారు.
- సామూహిక చర్చలు, కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయడం. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, నాటకరంగం, సీఐఎస్ఎఫ్ బృందంచే మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

యోగా నేర్చుకుంటున్నా



నేను యోగా నేర్చుకుంటున్న. మంచి భోజనం, వసతి, దుస్తులు అందించారు. ఎన్ని డబ్బులు ఖర్చుపెట్టినా దక్కని అవకాశం ఎన్టీపీసీ సంస్థ మాకు కల్పించింది. మేము దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం.

– ఎస్.నిక్షిత, ఎంపీపీఎస్, రామగుండం

కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న



వేసవిశిక్షణలో నేను కంప్యూటర్ నేర్చుకుంటున్న. నాకు డాన్స్ చేయడం అంటే ఇష్టం. ఎన్టీపీసీ సంస్థ శిబిరం ఏర్పాటు చేసి నెల రోజులుగా ఇస్తున్న శిక్షణలో నేను పూర్తిస్థాయిలో కంప్యూటర్ నేర్చుకుంటున్నా.

– నిహారిక, ఎంపీపీఎస్, ఖాజీపల్లె

నృత్యం అంటే ఇష్టం



ఉదయం నిద్ర లేవగానే యోగా, కరాటే నేర్పిస్తున్నారు. డాన్స్ టీ చర్ డాన్స్ నేర్పిస్తున్నారు. ఈ వేసవి శిబిరం మాకు చాలా ఉపయోగంగా ఉంది. శిక్షణ మా భవిష్యత్తుకు మంచి పునాది అవుతుంది.

– పి.మాధురి, ఎంపీపీఎస్, లక్ష్మీపురం

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం



ఎన్టీపీసీ రామగుండం సంస్థ సామాజిక సేవా బాధ్యతా పథకం(సీఎస్సార్) సహకారంతో బాలికా సాధికారత మిషన్–2023 నిర్వహిస్తున్నాం. 120మందిని 40మంది చొప్పున మూడు బ్యాచ్‌లుగా విభజించాం. చిన్నారులలోని సృజనాత్మకత వెలికితీయడంతో పాటు ఆసక్తి ఉన్న అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

– ఇంతియాజ్, కో–ఆర్డినేటర్, హీరో మైండ్ మైన్ సంస్థ

బాలికల భవితకు పూలబాట



బాలికల భవిష్యత్‌కు వెలుగు పూలబాట వేసేందుకు బాలికా సాధికారత మిషన్–2023 నిర్వహిస్తున్నాం. సీఎస్సార్ నిధుల ద్వారా హీరో మైండ్‌మైన్ సంస్థ పర్యవేక్షణలో శిక్షణ కొనసాగుతోంది. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 10మందికి ఎన్టీపీసీ సంస్థ ద్వారా ఇంటర్ వరకు ఉచిత విద్య అందిస్తాం.

– సునీల్‌కుమార్, చీఫ్ జనరల్ మేనేజర్ (ఎన్టీపీసీ రామగుండం- తెలంగాణ)

ఆర్జీ–1 జీఎంకు సన్మానం


సన్మానిస్తున్న భూనిర్వాసితులు

గోదావరిఖని: సింగరేణి భూనిర్వాసిత ప్రభావిత గ్రామాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌ను సన్మానించారు. సింగరేణి ప్రభావిత గ్రామాలైన జనగామ, సుందిళ్ల, ముస్త్యాల, సింగిరెడ్డిపల్లి, చందనాపూర్ తదితర గ్రామాల అభివృద్ధి, యువతకు ఉపాధి, తదితర సంక్షేమ పథకాలు అందించేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు జనగామ శంకర్, నాయకులు కృష్ణవేణి, చందనాపూర్ సర్పంచ్ దాసరి శంకర్, సింగిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ కుక్క శంకర్, జనగామ స్వామి, జి.సతీష్‌యాదవ్, జనగామ మల్లేశ్, ఎలకటూరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు పదోన్నతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తూ సదరన్ రీజియన్ హెడ్‌క్వార్టర్ మానవ వనరుల విభాగం డీజీఎం(హెచ్‌ఆర్) సవ్యసాచి ఉత్తర్వులు విడుదల చేశారు. నాన్–ఎగ్జిక్యూటివ్ ప్రమోషన్‌లో భాగంగా డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ–2023) మేరకు పదోన్నతులు కల్పించారు. వివిధ కేటగిరిలలో మొత్తంగా 38 మంది పదోన్నతి పొందారు. వీరిని ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యులు బాబర్ సలీంపాషా, ఉద్యోగ గుర్తింపు సంఘం (ఐఎన్టీయూసీ అనుబంధ–ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్) ప్రధాన కార్యదర్శి కొలిపాక మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, కందుల స్వామి, బండారి కనకయ్య అభినందించారు.

బొగ్గుబాయి వార్తలు

ఉద్యమాలతోనే కార్మికుల హక్కులు సాధ్యం

- ఈనెల 10లోపు ఒప్పందం కాని పక్షంలో ఉద్యమం ఉధృతం
- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం



మాట్లాడుతున్న ఫోరం నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఉద్యమాలతోనే కార్మిక హక్కులు సాధించుకోవచ్చని రామగుండం ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు స్పష్టం చేశారు. బుధవారం ప్రాజెక్టు రోడ్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 2018 ఒప్పందంలోని పూర్తి అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి యాజమాన్యం ప్రతినిధులు, ఫోరం నాయకులతో జరిగిన చర్చల్లో సీనియర్, ఐటీఐ కార్మికులకు ప్రమోషన్ పాలసీ అమలు చేస్తామని, డీఏ ఏరియర్స్ డబ్బులు రాని కార్మికులకు చెల్లిస్తామని, గతంలో మాదిరిగా గేట్‌పాస్‌లు యథావిధిగా కొనసాగిస్తామని, పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ కార్మికులను తీసుకుంటామని, ఈనెల 10వ తేదీలోగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని యజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. చిలుక శంకర్, నాంసాని శంకర్, ఇజ్జగిరి భూమయ్య, గీట్ల లక్ష్మారెడ్డి, బుచ్చన్న, చింతల సత్యం, జమీల్, శ్రీనివాస్, రాజమల్లయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, కంది చంద్రయ్య, ఏ శ్రీనివాస్, నాగభూషణం, కార్మికులు పాల్గొన్నారు.

డైరెక్టర్(పా) ఆకస్మిక తనిఖీ


ఫైళ్లను పరిశీలిస్తున్న డైరెక్టర్(పా) బలరాం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 జీఎం కార్యాయలయంలో డైరెక్టర్(పా) బలరాం బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అకౌంట్ డిపార్ట్‌మెంట్ తనిఖీ చేసి రోజువారీ జమలు, ఖర్చులు చెల్లించవలసిన బిల్స్ పరిశీలించారు. బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. పర్సనల్ డిపార్ట్ మెంట్‌ను సందర్శించి మెడికల్ అన్‌ఫిట్, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల అర్హత, డిపెండెంట్ ఉద్యోగ ధరఖాస్తులు, సంక్షేమం, టర్మినల్ బెనిఫిట్స్, క్వార్టర్ల కేటా యింపు, పదోన్నతులు, గ్రీవెన్స్ పరిష్కారం, రికార్డులు, గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్ విషయాలపై తనిఖీ చేశారు. ఎస్టేట్, ఆడిట్, ఫారెస్ట్, క్వాలిటీ విభాగాలను తనిఖీ చేశారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఉన్నారు.

మారుపేర్ల మార్పుపై సీఎం స్పష్టత ఇవ్వాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల మారుపేర్ల మార్పిడిపై సీఎం కేసీఆర్ స్పష్టత ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9న సీఎం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు వస్తున్న నేపథ్యంలో నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. మారుపేర్ల మార్పు కోసం వేలాది కార్మిక కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని, చాలామంది కారుణ్య నియామకాలు లభించక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్మికులకు సొంతింటి కల అమలు చేయాలని, 250 చదరపుగజాల భూమి అందించాలని కోరారు. డిపెండెంట్ వయసు 35 నుండి 40 ఏళ్లకు పెంచాలన్నారు. కార్మిక కుటుంబాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. సింగరేణికి బకాయి ఉన్న రూ.22వేల కోట్లు చెల్లించేలా చూడాలన్నారు. ఆయన వెంట నాయకులు మెండె శ్రీనివాస్, ఎస్.వెంకన్న, ఉల్లి మొగిలి, గుత్తికొండ గోపాల్, సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన వకీల్‌పల్లి గని పైకప్పు

- కూరుకుపోయిన షెటిల్‌కార్ యంత్రం
- గోఫ్ ఏరియాలోనే కంటిన్యూస్ మైనర్
- రెండు రోజులుగా నిలిచిన ఉత్పత్తి
- పర్యవేక్షించిన సింగరేణి డైరెక్టర్


వకీల్‌పల్లిగని

గోదావరిఖని: వకీల్‌పల్లి గనిలో పైకప్పు కూలింది. మంగళవారం రాత్రి కంటిన్యూస్‌మైనర్ సెక్షన్‌లో పైకప్పుబండ పెద్దఎత్తున కూలి షెటిల్‌కార్ యంత్రంపై పడింది. ఆసమయంలో షెటిల్‌కార్ యంత్రం నడుపుతున్న ఆపరేటర్ అందులోనే ఉన్నాడు. ఐదు మీటర్ల దూరంలో యంత్రంపై బండపడింది. ఆపరేటర్ దూరంగా ఉండటంతో ఆయన ఎలాంటి ప్రమాదం జరగలేదు. షెటిల్‌కు ముందు గోఫ్ ఏరియాలో ఉన్న కంటిన్యూస్ మైనర్ యంత్రం అందులోనే ఉండి పోయింది. ఇదే ప్రాంతంలో సైడ్‌వాల్ కూలి ఇద్దరు కార్మికులు గాయపడిన సంఘటన మర్చిపోకముందే ఈప్రమాదం జరగడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గనిలోని 76లెవల్, 36డీప్‌లో కంటిన్యూస్‌మైనర్ ద్వారా బొగ్గు కటింగ్ పనులు జరుగుతున్నాయి. కంటిన్యూస్ మైనర్ యంత్రం రిమోట్ ద్వారా గోఫ్ ఏరియాలో బొగ్గు వెలికితీసి షెటిల్‌కార్‌లో బొగ్గు లోడ్ చేసింది. ఇదే సమయంలో కంటిన్యూస్ మైనర్‌కు కొద్ది దూరంలో ఉన్న షెటిల్‌కార్‌పై పెద్ద ఎత్తున బండ పడటంతో అందులో ఇరుక్కుపోయింది. యంత్రాన్ని రిమోట్ ద్వారా ఆపరేటింగ్ చేస్తుండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని అంటున్నారు. విషయం తెలియడంతో ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ హుటాహుటిన గనిలోకి దిగి పరిస్థితి పర్యవేక్షిస్తున్నారు. పుల్లర్ టెక్నాలజీ ద్వారా బొగ్గు పొరల కింద ఇరుక్కుని పోయిన షెటిల్‌కార్‌ను బుధవారం రాత్రి వరకు బయటకు తీశారు. ఇంకా కంటిన్యూస్ మైనర్ యంత్రాన్ని తీయాల్సి ఉంది.

సైడ్‌వాల్ కూలిన ప్రాంతంలోనే..

గనిలోని కంటిన్యూస్‌మైనర్ సెక్షన్‌లో మూడు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో సైడ్‌వాల్ కూలి ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఇద్దరిలో ఒకరికి తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ తరలించారు. ఈసంఘటన మర్చిపోకముందే మంగళవారం పెద్ద ఎత్తున బండకూలి యంత్రంపై పడింది. పరిస్థితి అంచనావేసేందుకు బుధవారం సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎస్వీకే శ్రీనివాస్ గనిలోకి దిగారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి ఆపరేషన్ పనులు పర్యవేక్షించారు.

కాంట్రాక్టు కార్మిక హక్కుల కోసం పోరు


మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం జేఏసీ చేస్తున్న పోరాటాలకు ఐఎఫ్‌టీయూ(ప్రజాపంథా) సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర నాయకులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్ తెలిపారు. బుధవారం స్థానిక యూని యన్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయడంలో యాజమాన్యం అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. సమ్మె నోటీస్ ఇచ్చినా చర్చలు వేగవంతం చేయడం లేదన్నారు. అనంతరం రామగుండం ఏరియా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సత్యనా రాయణరెడ్డి, అధ్యక్షుడిగా తూళ్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా మార్త రాములు, ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లి చంద్రయ్య, సహాయ కార్యదర్శిగా టి.నరేష్, కోశాధికారిగా ఇసుగాల రాజేశ్వర్‌ను ఎన్నుకున్నా రు. ఆడెపు శంకర్, కల్వల రాయమల్లు, కొయ్యడ శంకర్, మాట్ల సమ్మయ్య, రాజేందర్, సారయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

మోదీ పాలనకు అండగా నిలుద్దాం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న దుగ్యాల ప్రదీప్

పెద్దపల్లిరూరల్: భారత ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో నీతివంతమైన పాలన సాగుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం భోజన్నపేట ఎంపీటీసీ మేకల రాజేశ్వరి, చీకురాయి మాజీ సర్పంచ్ రాయమల్లు, మాజీ ఉపసర్పంచ్ మేకల శ్రీనివాస్‌లకు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎమ్మెల్యే దాసరిమనోహర్‌రెడ్డి సహజవనరులను ఇష్టానుసారంగా దోచుకుంటున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యే వైఖరితో విసిగివేసారిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పార్టీలో చేరేందుకు ముందుకొస్తున్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, రాజేశ్వర్‌రావు, ప్రదీప్, శ్రీనివాస్, సంపత్ రావు, రాజం మహంత, దిలీప్, శ్రీకాంత్, చిలివేరు మధు, కిరణ్, నాగరాజు, సంపత్, రమేశ్, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, అన్వేష్, కోదాటి వెంకటరమణారావు, రాజు, సాయిచరణ్ ఉన్నారు.

రైళ్ల రద్దుతో ఇటుకబట్టీ కార్మికుల కష్టాలు

- రైల్వేస్టేషన్‌లోనే 24 గంటలు కాలయాపన


రామగుండం రైల్వే ప్లాట్‌ఫాంపై కార్మికుల పడిగాపులు

రామగుండం: ఇటీవల ఒడిశా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంతో అటువైపు వెళ్లే రైళ్లు రద్దయ్యాయి. దీంతో సొంత గ్రామాలకు వెళ్లే ఇటుకబట్టీల కార్మికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు ఒడిశా నుంచి వలస వచ్చిన కూలీలు.. ఇక్కడ పని ముగియడంతో సొంత గ్రామాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రామగుండం రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న కార్మికులు ఇక్కడి నుంచే నాగపూర్ మీదుగా ఒడిశా చేరుకుంటారు. సిద్దిపేట వైపు ఉన్న కార్మికులు సికింద్రాబాద్ నుంచి ఒడిశాకు వెళ్తారు. అయితే కొన్ని రైళ్ల రద్దుతో కార్మికులందరు రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్నారు. ముందస్తు రిజర్వేషన్ లేకపోవడంతో వారాంతపు రైళ్లు హిమసాగర్, దర్భాంగ, రాయ్‌పూర్, కోర్బా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం క్యూ కడుతున్నారు. ఆ రైళ్లకు రెండు సాధారణ బోగీలు మాత్రమే ఉండడంతో అందులోనే వందలాది మంది కిక్కిరిసిపోతున్నారు. రైల్వేశాఖ స్పందించి కార్మికుల కష్టాలను గుర్తించి ప్రత్యేక రైలు నడిపించాలని పలువురు కోరుతున్నారు.

ఆకాంక్షది హత్యే..

- 'ఖని'కి చేరిన ఆకాంక్ష మృతదేహం
- హతుడు అర్పిత్ కోసం అన్వేషణ
- పరారీలో నిందితుడు


ఆకాంక్ష(ఫైల్)

గోదావరిఖని/యశవంతపుర: బెంగళూరులో అనుమానాస్పదస్థితిలో విగతజీవిగా కనిపించిన పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చెందిన ఆకాంక్షది హత్యగా పోలీసులు నిర్ధారించారు. ఆమె స్నేహితుడే గొంతు నులిమి హతమార్చినట్లు గుర్తించారు. ఈ కేసులో బెంగళూరు జీవన్‌బీమానగర పోలీసులు నిందితుడి కోసం అన్వేషణ చేపట్టారు. బీకాం పూర్తి చేసిన ఆకాంక్ష బెంగళూరులో మార్కెటింగ్ సంస్థలో పనిచేసేది. ఢిల్లీకి చెందిన అర్పిత్ కూడా ఆకాంక్ష పనిచేస్తున్న సంస్థలోనే ఉద్యోగంలో చేరాడు. వీరి మధ్య స్నేహం పెరిగి, ప్రేమకు దారితీసినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం అర్పిత్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యాడు. అప్పటినుంచి ఆకాంక్ష స్నేహితురాలితో కలిసి ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది.

ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం

ఆకాంక్ష, అర్పిత్ మధ్య కొద్దిరోజులుగా విభేదాలు పొడచూపినట్లు సమాచారం. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లిన అర్పిత్ సోమవారం ఆకాంక్షను కలుసుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవ చోటుచేసుకోవడంతో ఆమెను గొంతును లిమి హత్య చేశాడు. తరువాత గొంతుకు చున్నీచుట్టి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అయితే ఫ్యాన్‌కు వేలాడదీయలేక నేలమీద పడుకోబెట్టి ఫ్లాట్ తాళం వేసి పరారయ్యాడు. ఆకాంక్షతోపాటు అదే ఫ్లాట్‌లో ఉన్న స్నేహితురాలు కొన్ని గంటల తరువాత వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తల్లిదండ్రుల రాక

హైదరాబాద్ నుంచి తల్లిదండ్రులు, బంధువులు చేరుకుని విగతజీవిగా ఉన్న ఆకాంక్షను చూసి బోరున విలపించారు. తమ కూతురిని అర్పిత్ హత్య చేసినట్లు మృతురాలి తల్లిదండ్రులు జీవన్ బీమానగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న అతడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు.

పూర్తయిన అంత్యక్రియలు

బెంగళూరులో హత్యకు గురైన ఆకాంక్ష మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. కన్నీటి మధ్య ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. తన కూతురు మరణానికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తండ్రి జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు.

కాల్చితే నిస్సారమే..



కొయ్యకాలును తగులబెడితే దున్నకం సులువు అవుతుందని భావిస్తున్న రైతు.. తనకు తెలియకుండానే పంట దిగుబడిని తగ్గించుకుంటున్నాడు. కొయ్యలను కాల్చడం ద్వారా భూమిలోని మిత్ర సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా, సేంద్రియ పదార్థం తగ్గిపోతుంది. భూమి పైపొర మాడిపోయి సహజ స్వభావం కోల్పోతుంది. మొక్కలకు పోషకాలు సరిగా అందించవు. అదే కలియదున్నితే కృత్రిమ ఎరువులా మారి.. మొక్కకు పోషకాలు అందుతాయంటున్నారు వ్యవసాయ అధికారులు. జిల్లాకేంద్రం శివారు బొంపల్లి, దొంగతుర్తి శివారుల్లో రైతులు కొయ్యకాలును తగులబెడుతూ ఇలా కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

2కే రన్‌లో పాల్గొనాలి



ఎస్సైని అభినందిస్తున్న క్రీడాకారులు

సుల్తానాబాద్: ఈనెల 12న జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహిస్తున్నామని క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సుల్తానాబాద్ ఎస్సై విజేందర్ కోరారు. బుధవారం సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి క్రీడాకారులు ఆయనను కలిసి సన్మానించారు. సుల్తానాబాద్ క్రీడాకారులకు పుట్టినిల్లని, జిల్లా కేంద్రంలో నిర్వహించే 2కే రన్‌లో పట్టణంతో పాటు మండలం నుంచి అధిక సంఖ్యలో యువకులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. వీపీవో లక్ష్మారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువతి అంత్యక్రియలకు ఆర్థికసాయం

- స్పందించిన స్థానికులు
- రూ.15వేలు అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న దేవీ లక్ష్మీనర్సయ్య

పాలకుర్తి: బసంత్‌నగర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన దేవ సుజాత(33) అవివాహిత అంత్యక్రియలకు స్థానికులు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. గ్రామానికి చెందిన సుజాత రెండురోజుల క్రితం అనారోగ్యానికి గురై మంగళవారం రాత్రి మృతిచెందింది. నిరుపేద కుటుంబం కావడంతో సుజాత అంత్యక్రియలు నిర్వహించేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే స్థానికులు స్పందించి తోచిన సాయం విరాళంగా అందించారు.ఈమేరకు పోగైన రూ.15వేలను కన్నాల టీఆర్‌ఎస్ నాయకుడు దేవీ లక్ష్మీనర్సయ్య సుజాత కుటుంబసభ్యులకు అందించారు. సుజాత కుటుంబాన్ని దాతలు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మిషన్‌కాకతీయతో భూగర్భజలాల పెంపు



చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ చేపట్టిన మిషన్ కాకతీయ పనులతోనే చెరువులు జలకళ సంతరించుకుని భూగర్భజలాలు పెంపొందాయని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం తలపెట్టిన చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ అధికారులు చేస్తున్న ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, మేనేజర్ శివప్రసాద్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య వెంట ఉన్నారు.

విద్యార్థికి మంత్రి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి కొప్పుల

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ బాలికల గురుకులం పాఠశాలలో పదో తరగతిలో 9.5 జీపీఏ సాధించి స్కూల్‌టాపర్‌గా నిలిచిన సంబారి అర్చనను మంత్రి కొప్పుల ఈశ్వర్ అభినందించారు. ధర్మపురిలోని ఎస్‌హెచ్‌ఆర్ గార్డెన్‌లో మంత్రికొప్పుల అర్చనను అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జగిత్యాల జాయింట్ కలెక్టర్ లత, జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత, కరీంనగర్ జిల్లా డీసీఎంస్‌చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీలు బాదినేని రాజేందర్, బత్తిని అరుణ, మున్సిపల్ చైర్మన్ సంగి సత్యమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గూడా రాంరెడ్డి, ఏలేటి కృష్ణారెడ్డి, గురుకులం విద్యాలయం పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుంచు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ధూళికట్టలో ఉపాధిహామీ కూలీల జాతర

ఎలిగేడు: మండుతున్న ఎండలు, వడగాడ్పులు మరో మూడు రోజులు ఉంటాయని ఓవైపు వాతావరణశాఖ చెబుతున్నప్పటికీ ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో ఉపాధిహామీలో కూలీల జాతర కొనసాగుతోంది. సర్పంచ్ గొల్లే కావేరి, ఉపాధిహామీ అధికారుల ప్రోత్సాహంతో గ్రామంలో నిర్వహిస్తున్న చెరువుమట్టి పూడికతీత పనుల్లో బుధవారం ఒక్కరోజు 92 మంది కూలీలు హాజరై పనులు చేశారు. ఉదయాన్నే పనికి వచ్చి ఎండ తీవ్రం అయ్యేలోపు జాగ్రత్తలు తీసుకుంటూ పనులు ముగించుకుని వెళ్తున్నారు. కూలీ డబ్బులు రూ.200కు పైగా పడుతుందని కూలీలు పేర్కొంటున్నారు. అధికారులు తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు.

అదనులో సాగు.. అన్నదాతకు మేలు

- ప్రారంభమైన పంటల సీజన్
- రోహిణిలో వరినార్లతో ఎక్కువ దిగుబడి
- నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలంటున్న వ్యవసాయశాఖ
- పత్తి సాగుకు దుక్కులు సిద్ధం
- రుతుపవనాల కోసం ఎదురు చూపు

> జిల్లాలో వానకాలంలో 2.85 లక్షల ఎకరాలు సాగుచేసేందుకు సిద్ధంకాగా ఇందులో బావులు, బోర్లు, చిన్న నీటి పారుదల కుంటలు, చెరువుల కింద, ఎస్సారెస్పీ ప్రాజెక్టు కింద వచ్చే సాగు నీటితో ప్రస్తుతం 2.2,800 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేస్తున్నాయి. మిగతా వాటిలో పత్తి, మొక్కజొన్న, అపరాల సాగుకు అంచనాలు తయారు చేశారు. త్వరలోనే రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించనున్నందున రైతులు సాగుకు దుక్కులు దున్నించి సిద్ధంగా ఉన్నారు.



పెద్దాపూర్‌లో దుక్కి దున్నేందుకు మడులను లెవల్ చేస్తున్న దృశ్యం



వరిసాగుకు పొలంలో సిద్ధం చేసిన నారుమడి

జూలపల్లి: అన్నదాతలు పంటల సాగును అదనులో చేపడితే ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. సమయానుకూలంగా సాగులో మెళకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అదను దాటి సాగుచేస్తే చీడపీడల బారిన పడక తప్పదని దీంతో రసాయన ఎరువుల వాడకం పెరిగి పెట్టుబడులు అధికమై వ్యవసాయం లాభసాటిగా లేక, నష్ట పోవాల్సి వస్తోంది. సాగును లాభసాటిగా మార్చుకోవాలంటే అదనులో విత్తనలు వేయాల్సిందిగా అధికారులు కోరుతున్నారు.

దుక్కులు సిద్ధం చేయాలి..

విత్తనాలు వేసేందుకు భూమిని దుక్కి దున్నించడంతో భూమి గుల్లగా మారి భూసారం పెరుగుతుంది. భూసార పరీక్షలు చేయించి, సేంద్రియ ఎరువులు పోసుకుంటే భూమి స్వభావం మారి పంటలకు అనువుగా తయారవుతాయి. మొదటి వర్షాలు పడగానే కల్టివేటర్‌తో కలియ దున్ని, జూన్‌లో పత్తి విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధం చేసుకున్నారు.

రోహిణి కార్తెలో వరిసాగు మేలు..

రోహిణి కార్తెలో బావులు, బోర్ల కింద వరినార్లు జూన్ మొదటి వారం నుంచి జూలై రెండో వారంలోనే పోసుకుంటే పూర్తి పంట దిగుబడి వచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించి నాణ్యమైన విత్తనాలు పోసుకుంటే చీడపీడలు ఆశించకుండా పూర్తిస్థాయిలో పంటను పండించవచ్చు. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గిపెట్టుబడి తగ్గడంతో రైతులకు లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది.

వాణిజ్య పంటలు లాభదాయకం..

జూన్ నెలాఖరు నుంచి జులై నెలాఖరు లోగా వాణిజ్య పంటలసాగు మేలు చేస్తుంది. పప్పు దినుసులు, మిర్చి, పసుపు, పంటలు ఎక్కువ పంటపండే అవకావం ఉంటుంది. మొక్కజొన్నకు కూడా అనువుగా ఉంటుంది. రైతులు సాగుచేసే పంటలను అదనులోనే విత్తనాలు వేస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

రెండు వానలు పడితే పత్తి వేస్తా



పత్తి సాగుకు ఇప్పటికే దుక్కి దున్నించి సిద్ధం చేశాను. రెండు వర్షాలు పడితే వెంటనే పత్తి విత్తనాలు వేస్తాం. జూన్ రెండో వారంలో పత్తివిత్తనాలు పెట్టాలని అనుకుంటున్న.

– కూసుకుంట్ల వెంకటరెడ్డి, రైతు, జూలపల్లి

రోహిణిలో నారుతో ఎక్కువ పంట



బావుల కింద నార్లుపోస్తే పంట ఎక్కువ వస్తుంది. నీటి సౌకర్యం ఉంటేనే నార్లు పోయాలి. మంచి నాణ్యమైన విత్తనాలు పోస్తే చీడపీడల నుంచి కాపాడవచ్చు. పంట కూడా ఎక్కువ వస్తుంది.

– నాడెం మల్లారెడ్డి, ఉత్తమ రైతు, జూలపల్లి

జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి. భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువులు వాడాలి. నాణ్యమైన విత్తనాలు తీసుకుని శుద్ధిచేసి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి.

– ప్రత్యూష, ఏవో, జూలపల్లి

హరితహారానికి నీటి ట్యాంకర్లు

- రూ.32 లక్షలతో కొనుగోలు



పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో కొత్తగా మరో మూడు నీటి ట్యాంకర్లను అధికారులు కొనుగోలు చేశారు. పట్టణ ప్రగతి నిధులు రూ.32 లక్షలతో ట్రాక్టర్లను కొనుగోలు చేసి బుధవారం ఈఈ సుచరన్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ బి.సుమన్ రావు పరిశీలించారు. నీటి ట్యాంకర్లను పట్టణ హరితహారం కోసం ఉపయోగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. దశాబ్ది ఉత్సవాల్లో నీటి ట్యాంకర్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ



క్రీడాకారులతో మార్కెట్ చైర్మన్, సర్పంచ్

ధర్మారం: మండలంలోని కొత్తపల్లిలో క్రీడాకారులకు మార్కెట్‌కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి బుధవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా చైర్మన్ సొంత ఖర్చులతో టీషర్టులు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోమటిరెడ్డి లలితా, ఉపసర్పంచ్ అజ్మీర రవినాయక్, కార్యదర్శి రమేశ్, వార్డుసభ్యులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఊరురా బడిబాట

కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ/జూలపల్లి/సుల్తానాబాద్‌రూరల్/రామగుండం/ఓదెల/గోదావరిఖనిటౌన్: పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజక వర్గాల వ్యాప్తంగా బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లు గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంతో పాటు నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై, పది ఫలితాల్లో విద్యార్థులు సాధించిన జీపీఏ ర్యాంకులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన చేస్తున్నామని వివరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులను అభినందించారు. జూలపల్లి బడిబాటలో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని, పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన బొడ శ్రీవైష్ణవిరెడ్డి, నాంపల్లి శాలినిని సన్మానించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అడ్మిషన్లు ప్రారంభమైన నేపథ్యంలో గోదావరిఖని 30వ డివిజన్ జవహర్‌నగర్ అంబేద్కర్–2 అంగన్‌వాడీకేంద్రం టీచర్ వెంకటరమణి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, హెచ్‌డబ్ల్యూసీ శ్రీవాణీ హాజరయ్యారు. కేంద్రంలో నలుగురు గర్భిణులకు సీమంతం చేశారు. ఆర్నెళ్ల బాబుకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్, ఆయా భాగ్యలక్ష్మి, ఆశావర్కర్లు కనకలక్ష్మి, షమీం ఇంటింటికీ తిరుగుతూ మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీకేంద్రంలో చేర్పించాలంటూ ప్రచారం చేశారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీచర్లు, హెచ్‌ఎంలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జూలపల్లిలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న డీఈవో మాధవి, విద్యార్థులు, టీచర్లు, ఉపాధ్యాయులు

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి



నిరసన చేస్తున్న సీఐటీయూ నాయకులు

జ్యోతినగర్: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భిక్షపతి, ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో ఫ్లకార్డులతో నిరసన చేపట్టారు. ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి తాము మద్దతిస్తున్నట్లు తెలిపారు. లైంగిక కోరికలు తీర్చాలని ఇబ్బంది పెట్టిన వ్యక్తిని ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ ఎన్టీపీసీ రామగుండం ఏరియా కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, నాయకులు రామాచారి, నాంసాని శంకర్ రాజయ్య, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బంది రక్తదానం

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వాస్పత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్న ఎ.కొమురయ్య తన పుట్టిన రోజు సందర్భంగా, ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో స్వచ్ఛందంగా రక్తదానం చేశాడు. కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకున్న మరో ఐదుగురు ఆస్పత్రి సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వేసవి కారణంగా బ్లడ్ బ్యాంకులో రక్తం నిల్వలు నిండుకుంటున్న క్రమంలో కొమురయ్యతోపాటు ఐదుగురు స్వచ్ఛందంగా రక్తదానం చేయడంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, బ్లడ్ సెంటర్ పాథాలజిస్టు వంశీకృష్ణ అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మి

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గాదె సతీశ్‌కు రూ.18వేలు, గనవేన నర్సమ్మకు రూ.28వేలు, బర్ల కళావతికి రూ.22వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ప్రభుత్వం నుంచి మంజూరు కాగా లబ్ధిదారులకు ఎంపీపీ రాసకొండ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాసకొండ చందు, నాయకులు రాసకొండ రవి, దామెర సంపత్, గడుప కృష్ణమూర్తి, దండె రమేశ్, పిడుగు అంజి, సాన సురేశ్‌తో పాటు పాల్గొన్నారు.

రామగిరి మండలంలో..

రామగిరి మండలం రత్నాపూర్‌కు చెందిన ధర్ముల రమ్యకు ప్రభుత్వంనుంచి మంజూరైన రూ. 38,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును రమ్యకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమ, ఎంపీటీసీ ధర్ముల రాజసంపత్, నాయకులు సందవేన కుమార్, జక్కుల రాజయ్య, రాధాకృష్ణ ఉన్నారు.

ఘనంగా బీరన్న కల్యాణం

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరన్న కమరాతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. యాదవ కులస్తులు బీరన్న, కమరాతి, మంకాళమ్మ బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి ఒగ్గు పూజారులు వేసిన పట్నాలపై ఉంచి మొక్కులు చెల్లించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, సర్పంచ్ మాంకాళి తిరుపతి, మాజీ ఎమ్మె ల్యే విజయరమణరావు, బీజేపీ నాయకులు జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, ఏగోళపు సదయ్యగౌడ్, ఎంపీటీసీలు దండె వెంకటేశం, మల్లేశ్ యాదవ్, పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

నేడు రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని తొగర్రాయిలో నూతన ఆలయంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం సాముహిక హోమాలు నిర్వహించారు.ఈనెల 11న పోచమ్మ బోనాలు, 13న ఎల్లమ్మ బోనాలు, 14న ఎల్లమ్మ పట్నాలు, కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో భక్తులు

ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామ చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో బుధవారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ముదిరాజ్ మహిళలు ఇంటి నుంచి బోనాలతో వచ్చి హోమం నిర్వహించి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, కులస్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్పంచులకు భారంగా చెరువుల పండుగ

రామగుండం: దశాబ్ది వేడుకల్లో భాగంగా నేడు ఊరూరా చెరువుల పండుగ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులను ఆదేశించింది. కాగా ఎండలు దంచికొడుతుండడంతో గ్రామాలు నిర్మానుష్యంగా మారాయని చెరువుల పండుగకు జనసమీకరణ కష్టంగా మారిందంటూ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పండుగల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం అందించిన నిధులు సాంస్కృతిక ప్రదర్శనలు, సామూహిక భోజనాలకు ఏ మాత్రం సరిపోవని సర్పంచ్‌లు మదనపడుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక తలలు పట్టుకుంటుంటే వేడుకల పేరిట సర్పంచులను భాగస్వాములను చేస్తూ మరింత ఆర్థిక సమస్యల్లోకి నెడుతున్నారని మనోవేదన చెందుతున్నారు అంతర్గాం మండల పరిధిలో గ్రామాల వారీగా ఊరూరా చెరువుల పండుగకు నిధుల కేటాయింపులో విలేజీ అంతర్గాంకు రూ.7,100, వీసంపేటకు రూ.7,175, ఎగ్లాస్‌పూర్‌కు 9,475, టీటీఎస్ అంతర్గాంకు రూ.9,850, సోమన పల్లికి రూ.9,963, మద్దిర్యాలకు రూ.12,038, ఆకెనపల్లికి రూ.13,175, రాయదండికి రూ.15,963, ఎల్లంపల్లికి రూ.17,075, పొట్యాలకురూ.20,675,పెద్దంపేటకు రూ.20,900, బ్రాహ్మణపల్లికి రూ.22,475. లింగాపూర్‌కు రూ.23,688, గోలివాడకు రూ.28,875, ముర్మూర్‌కు రూ.36,850, కుందనపల్లి రూ.37,975 కేటాయించారు.

ఊరూరా చెరువుల పండుగకు ఏర్పాట్లు పూర్తి

సుల్తానాబాద్/ధర్మారం/జూలపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు నర్విహించే వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునిత, కమిషనర్ రాజశేఖర్ కోరారు. గురువారం నిర్వహించే కార్యక్రమంలో ముదిరాజ్‌కులస్తులతో పాటు అన్నివర్గాల ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి రావాలని అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ధర్మారం మండలంలోని 29 జీపీల్లో చెరువుల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఆయా గ్రామాల సర్పంచులు అన్ని ఏర్పాట్లుచేశారు. గ్రామాల్లోని చెరువుల వద్ద స్థానిక ప్రజలకు చెరువుల ప్రాముఖ్యతను అధికారులు వివరించనున్నారు. చెరువు కట్టలను శుభ్రం చేయడంతో పాటు సమావేశం నిర్వహించేందుకు స్థలాలను గుర్తించి పిచ్చిమొక్కలు తొలగించారు. చెరువులు లేని గ్రామాల్లో బతుకమ్మ నిమజ్జనం చేసే స్థలంలో వేడుకలు నిర్వహించాలని ధర్మరం ఎంపీడీవో జయశీల, జూలపల్లి ఎంపీడీవో వేణుగోపాల్ రావు ఆదేశించారు. చెరువుల పండుగలో భాగంగా గ్రామస్తులకు భోజనాలు పెట్టాలని సూచించారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

ఓదెల: మండలంలోని గోపరపల్లెలో పోశమ్మగుడి వద్ద బోర్‌వెల్ పనులను ఎంపీటీసీ గోపు లావణ్య పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ నిధుల నుంచి పోశమ్మగుడి వద్ద బోరింగ్ వేసినట్లు ఎంపీటీసీ తెలిపారు. సర్పంచ్ కర్క మల్లారెడ్డి, వార్డుసభ్యులు, పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్‌లో బుధవారం గ్రెస్ క్యాన్సర్ ఫౌండేషన్, తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు క్యాన్సర్ వ్యాధి పరీక్షలతో పాటు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, పాప్‌స్మియర్‌తో పాటు ఇతర క్లినికల్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

పదోన్నతిపై తహసీల్దార్ బదిలీ

జూలపల్లి: మండలకేంద్రంలోని కార్యాలయంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జయశ్రీ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లారు. జూలపల్లి తహసీల్దార్‌గా మంథని ఆర్డీవో కార్యాయలంలో పనిచేస్తున్న తూం రవీందర్ జూలపల్లి తహసీల్దార్‌గా బదిలీపై వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రమాదవశాత్తు ధాన్యం దగ్ధం

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌కు చెందిన బూర్ల మల్లయ్య ఎకరం పొలంలో కోసిన ధాన్యం బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని కాలిపోయినట్లు వైస్ఎంపీపీ రమేశ్ తెలిపారు. రైతు ధాన్యాన్ని హుస్సేన్‌మియా వాగు సమీపంలో చేను వద్ద నిల్వచేశాడు. మంటలు అంటుకుని రూ.50వేల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద టీఎల్‌పీ నిరసన

రామగుండం: దశాబ్ది వేడుకల్లో బుధవారం నిర్వహించేది సాగునీటి దినోత్సవం కాదని భూస్వాముల దినోత్సవమని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నిరసన తెలుపుతూ మాట్లాడారు. రాష్ట్రంలో నాలుగు కోట్ల ఎకరాల భూములుండగా రెండు కోట్ల ఎకరాల్లో వ్యవసాయం సాగవుతోందని అందులో 1.20 లక్షల ఎకరాలు పెట్టుబడిదారులు, బడా పారిశ్రామిక వేత్తల చేతుల్లోనే ఉన్నాయన్నారు. మిగతా 80 లక్షల ఎకరాలు అన్నికులాల వారు సాగుచేస్తున్నారని అందులో సింహభాగం కౌలు రైతులు సాగు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 78 లక్షల మంది ఎస్సీలుండగా 43 లక్షల మందికి భూములు లేవన్నారు. సీఎం కేసీఆర్ హామీ నెరవేర్చాలని దళితులకు మూడెకరాలు ఇవ్వాలని, ధరణి పేరుతో లాక్కున్న భూములను తిరిగి సాగుదారులకు అప్పగించాలని, పోడు రైతులకు పట్టాలు మంజూరు చేయాలని టీఎల్‌పీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. టీఎల్‌పీ ప్రతినిధులు కొయ్యడ శివరాజ్, సాయితేజ, జక్కం కవిత, అఖిల్‌వర్మ, పొన్నం రజిత, కన్నం భానుచందర్, చెరుకుపైడి ఉన్నారు.

అంతర్గాంలో ఎమ్మెల్యే ప్రగతి యాత్ర



వృద్ధ దంపతులతో ఎమ్మెల్యే చందర్

రామగుండం: దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ టీటీఎస్ అంతర్గాంలో ప్రగతియాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటా పర్యటిస్తున్న క్రమంలో వృద్ధులు లచ్చమ్మ–రాజయ్యను కలువగా కన్నీటి పర్యంతమయ్యారు. తమ బాగోగులు చూసేందుకు ఎవ్వరు రాలేదని సీఎం కేసీఆర్ ఇస్తున్న పింఛన్‌తోనే బతుకుతున్నామన్నారు. బతికినంత కాలం కేసీఆర్‌కే తమ ఓటన్నారు. త్వరలోనే బ్రాహ్మణపల్లి ఎత్తిపోతలు పూర్తి కానున్నాయని, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో అంతర్గాంకు పూర్వవైభవం రానుందన్నారు. ఈయాత్రలో వైస్ఎంపీపీ మట్టలక్ష్మి, సర్పంచ్ వెంకటమ్మ, తిరుపతినాయక్, కోల సంతోష్‌గౌడ్, బొద్దుపల్లి శ్రీనివాస్, గీట్ల శంకర్‌రెడ్డి తదితరులున్నారు.



ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఉత్తమ సేవలందించిన మీసేవా నిర్వాహకుడికి ప్రశంస

ఎలిగేడు: మండలకేంద్రంలో మీసేవా కేంద్రం నిర్వహిస్తున్న ఇందారపు తిరుమల రాజుకు మీసేవా రంగంలో ఉత్తమ సేవలందించినందుకు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎన్టీపీసీలో కలెక్టర్ సంగీత సత్యనారాయణ, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రశంసాపత్రం అందించారు. తిరుమలరాజు మాట్లాడుతూ.. ఈఅవార్డు తనపై మరిం త బాధ్యత పెంచిందని, తనకు సహకరించిన ఎలిగేడు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.